క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు చర్యలు



రోడ్‌సేఫ్టీ మొబైల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు టౌన్ : ఏలూరు జిల్లాలో జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్‌సేఫ్టీ మొబైల్ బృందాలు అప్రమత్తంగా వ్యవహరించాలని డీఎస్పీ శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ కార్యాలయం వద్ద రోడ్‌సేఫ్టీ మొబల్ అధికారులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను సమీపంలోని హాస్పిటల్స్ తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు, రాత్రివేళల్లో జరిగే రాబరీలు, చోరీలను అరికట్టేందుకు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సమావేశంలో ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, టీడీఆర్‌బీ మధు, సిబ్బంది ఉన్నారు.

27, 28 తేదీల్లో ఆటల పోటీలు

ఏలూరు రూరల్ : ఈ నెల 29 జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఆటల పోటీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొనాలని డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో క్రీడాకారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఫిట్ ఇండియా మొబైల్ యాప్ ద్వారా విద్యార్థులకు ఆరోగ్యం, వ్యాయామం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. స్పోర్ట్స్ ఆథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు 27, 28 తేదీల్లో ఏలూరులో బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హేండ్‌బాల్, స్కేటింగ్, రన్నింగ్, వాకింగ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 29న భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పలు క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, పీడీలు పాల్గొన్నారు.

వేధింపులతోనే న్యాయవాది కార్తీక్ మృతి

ఏలూరు (టూటౌన్): భార్యతో పాటు అత్తింటి వారి వేధింపుల వల్లే న్యాయవాది పయసం కార్తీక్ అనారోగ్యానికి గురై మరణించాడని దళిత నాయకులు, న్యాయవాదులు, కార్తీక్ తల్లిదండ్రులు ఆరోపించారు. ఏలూరు శంకర మఠం వీధిలోని కార్తీక్ పెద్ద కర్మ కార్యక్రమం వద్ద సోమవారం హైకోర్టు న్యాయవాది వి.ఉదయ్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు సబవరాజు, ఏలూరు బార్ అసోసియేషన్ న్యాయవాది జీఈ డానియేల్, ఎంఆర్‌పీఎస్ నాయకులు బయ్యారపు రాజేశ్వరరావు, కార్తీక్ తండ్రి రత్నరాజులు విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు శంకరమఠం వీధిలో రాజు ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్ నిర్వహిస్తున్న న్యాయవాది పయసం రత్నరాజు గతంలో హైదరాబాద్‌లో ఉండగా అతని కుమారుడు పయసం కార్తీక్ మల్కాజ్‌గిరికి చెందిన మనిషా ప్రియా యాదవ్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడన్నారు. ఆరేళ్ల తర్వాత మనిషా ప్రియా యాదవ్ తండ్రి మరణించడంతో హైదరాబాద్ వెళ్లి నాటి నుంచి ఆమె తిరిగి రాలేదని తెలిపారు. ఆమెతో పాటు అత్తింటి వారు కార్తీక్‌ను వేధించారని, హైదరాబాద్‌లో వరకట్న వేధింపుల కేసు పెట్టి ఏలూరు టూటౌన్ పోలీసులకు రిఫర్ చేయించారని వివరించారు. పోలీసులు దర్యాప్తులో విఫలమయ్యారని, వేధింపులు భరించలేక కార్తీక్ అనారోగ్యానికి గురై ఈనెల 14న మృతి చెందాడని తెలిపారు. కార్తీక్ మరణానికి కారణమైన భార్య, అత్తింటి వారిపై చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని లేదంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

జీఓ 117ను రద్దు చేయాల్సిందే

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న జీఓ 117ను రద్దు చేయాల్సిందేనని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ చెరుకూరి సుభాస్ చంద్రబోస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల జీఓ 84ను రద్దు చేయాలని, పదోన్నతులు కల్పించాలని కోరారు. అసోసియేషన్ ఏలూరు జిల్లా ఆర్థిక కార్యదర్శిగా భూక్యా రాము, జిల్లా ఉపాధ్యక్షుడిగా చేకూరి రఘు కుమార్, మహిళా కార్యదర్శిగా యు.శ్యామల, రాష్ట్ర కమిటీ ప్రతినిధిగా పి.రాహేలమ్మ, రాష్ట్ర కార్యదర్శిగా టి.విజయానంద్, ఎంటీఎస్ జిల్లా కన్వీనర్‌గా టి.ఎడ్వర్డ్‌లను నియమించారు.

కొల్లేరు బ్రాండ్ కాపాడాలి

ఏలూరు రూరల్ : కొల్లేరు పరిసరాల్లో చేపలకు జాతీయ స్థాయిలో మంచి గిరాకీ ఉందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. కొల్లేరు బ్రాండ్ కాపాడేందుకు మత్స్యశాఖ అధికారులు మరింత కృషి చేయాలన్నారు. సోమవారం ఆయన ఏలూరులోని మత్స్యశాఖ కార్యాలయంలో అధికారులతో చేపల సాగుపై సమీక్షించారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశాల్లో కొల్లేరు పరిసరాల్లో చేపల పెంపకదార్లు కోళ్ల వ్యర్థాలను వాడుతున్నారని వ్యాపారస్తులు ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. అలాంటి వారిని ఉపేక్షించవద్దని ఆదేశించారు. సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచారి, అసిస్టెంట్ డైరెక్టర్ నరసయ్య, రాజ్‌కుమార్‌తో పాటు మండలాధికారి దివ్య పాల్గొన్నారు.



వైద్యుల రక్షణకు చట్టం చేయాలి



ప్రభుత్వ బోధనాసుపత్రులు, మెడికల్ కళాశాలలు, ప్రైవేటు హాస్పిటల్స్‌లో వైద్యుల భద్రతకు ప్రత్యేకంగా చట్టం చేయాలి. వైద్యులు చికిత్స చేసే సమయంలో రోగికి ప్రమాదం జరిగితే దాడులు చేయటం, హాస్పిటల్స్‌ను ధ్వంసం చేసేవారిపై కఠిన చర్యలు ఉండాలి. మహిళా వైద్యుల రక్షణకు చట్టం చేయాలి. కోల్‌కత్తా ఆర్‌జీ కార్ మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలిపై హత్యాచారానికి పాల్పడడం దేశాన్ని కదిలించివేసింది. నిందితులకు కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వాలు నిస్పక్షపాతంగా వ్యవహరిస్తేనే నేరస్తులకు భయం ఉంటుంది.

– డాక్టర్ ఐ.రాజీవ్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్

దాడులను అరికట్టాలి



ప్రజలకు అనారోగ్యం వస్తే వైద్యసేవలు అందించే వైద్యులను దేవుడిలా భావిస్తూ ఉంటారు. కానీ ఇటీవల వైద్యులు, మహిళా వైద్యులపై దాడులు పెరగడం ఆందోళన కలిగిస్తున్నాయి. కోల్‌కత్తాలో జరిగిన దారుణ ఘటనతో మహిళా వైద్యుల్లో అభద్రతాభావం లేకుండా భరోసా కల్పించేలా అక్కడి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. నిందితులకు కఠిన శిక్షలు విధించటం ద్వారా నేరాలకు పాల్పడే వారికి హెచ్చరిక చేసినట్టవుతుంది. కేంద్ర ప్రభుత్వం వైద్యుల రక్షణకు చట్టాన్ని తీసుకొచ్చి పటిష్టంగా అమలు చేయాలి.

– డాక్టర్ నాగేశ్వరరావు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఏలూరు

ముక్కు మూసుకోవాల్సిందే!

- ఏలూరులో పడకేసిన పారిశుధ్యం
- ఎక్కడి చెత్త అక్కడే
- పట్టించుకోని నగరపాలక సంస్థ
- ప్రజలపై సీజనల్ వ్యాధుల దాడి
- మొక్కుబడిగా స్టాప్ డయేరియా కార్యక్రమం
- కనబడని ఇంటింటి చెత్త సేకరణ బండ్లు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్త దర్శనమిస్తోంది. డ్రెయిన్లలో మురుగు పారక దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో ఇంటింటికి చెత్త సేకరణ చేసే సిబ్బంది అప్పుడప్పుడు దర్శనమిస్తుండడంతో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లోనే చెత్తను డంప్‌చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ముగురు నీరు రోడ్డు పైకి వస్తుంది. మురికి నీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దోమలు విజృంభించి, ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు జ్వరపీడితులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరాల నివారణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొక్కుబడిగా 'స్టాప్ డయేరియా'

గత నెల ఒకటో తేదీన ప్రారంభించిన 60 రోజుల స్టాప్ డయేరియా కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. ప్రతి రోజూ ఏదో ఒక డివిజన్‌లో మొక్కుబడిగా పర్యటించి అక్కడి దోమల లార్వా నివారణకు చర్యలు తీసుకుంటున్నట్టు, ప్రజలకు అవగాహన కల్పించినట్టు ఫొటోలు తీసుకోవడానికే నగరపాలక సంస్థ పబ్లిక్ హెల్త్ శాఖ పరిమితమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్య నివారణ లేదా దోమల నివారణ లేదా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేయడం లేదని స్థానికులు వాపోతున్నారు.

మురికివాడల్లో నివారణ చర్యలేవీ

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని 50 డివిజన్లలో సుమారు 70 వరకు మురికి వాడలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండటంతో పేద, మధ్యతరగతి ప్రజలంతా జ్వరాల బారిన పడుతున్నారు. తమకు వచ్చింది సాధరాణ లేదా వైరల్ లేదా మలేరియా లేదా డెంగీ లేదా టైఫాయిడో జ్వరమో తెలియక ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



ఏలూరు బాలయోగి వంతెన సమీపంలో జంతు కళేబారాలు, వ్యర్థాలతో దుర్గంధం వెదజల్లుతున్న దృశ్యం



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఓపి విభాగం వద్ద క్యూలో నిల్చున్న రోగ పీడితులు



రక్త నమూనా వద్ద బారులు తీరిన జ్వర పీడితులు



టైటస్ నగర్‌లో రోడ్డు పైనే నిలువ నీరు చేరిన దృశ్యం



చింతలపూడి వెళ్లే రహదారిలో పేరుకు పోయిన చెత్త



తంగెళ్లమూడి మెయిన్ రోడ్డులో నిలిచిన ముగురు నీరు



శ్రీరామ్‌నగర్ ఒకటవ రోడ్డులో డ్రెయినేజీ పక్కనే సంచరిస్తున్న పందులు

పరీక్షల పేరుతో దోపిడీ

జ్వర పీడితులను రక్త పరీక్షల పేరుతో నిలువ దోపిడీ చేస్తున్నారు. స్థానిక హెల్త్‌సెంటర్‌లో సాధారణ జ్వరాలకు మాత్రమే పరీక్షలు చేస్తున్నారు. అనుమానం ఉన్న రోగులను మెరుగైన పరీక్షల కొరకు జిల్లా ప్రభుత్వాసుపత్రికి వెళ్లమని సూచిస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లాక రక్త పరీక్షలు ఒక రోజు చేయించుకుంటే.. సబంధించిన రిపోర్టులు మరుసటి రోజు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు ప్రైవేటు పరీక్షా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదనుగా ప్రైవేటు పరీక్షా కేంద్రాలు బాధితులను నిలువ దోపిడీ చేస్తున్నాయి. మినిమం రూ.1000 నుంచి రూ.3 వేలు వరకు వసూలు చేస్తున్నాయి. దీంతో పేదలు లబోదిబోమంటున్నారు.

నిత్యం వందల సంఖ్యలో జ్వర పీడితులు

ఏలూరు నగరంలో నిత్యం వందల సంఖ్యలో జ్వర పీడుతులు ఆస్పత్రులకు వరుస కడుతున్నారు. వైద్యం అందుకుని జ్వరం తగ్గినా, దాని ప్రభావం వల్ల 10 నుంచి 15 రోజులు శరీరంలో నిస్సత్తువ ఆవహిస్తుందని, నీరసంగా ఉంటుందని బాధితులు వాపోతున్నారు. జ్వరం మూడు నుంచి ఐదు రోజుల్లో తగ్గుతున్నా దాని ప్రభావం వల్ల వచ్చే ఇతర సమస్యలు రోజుల తరబడి పట్టి పీడిస్తున్నాయని చెబుతున్నారు. వైద్యులు మాత్రం ప్రస్తుత సీజన్‌లో వచ్చేవన్నీ సాధరణ జ్వరాలే అధికంగా ఉన్నాయని, మలేరియా, డెంగీ వంటివి చాలా తక్కువ కేసులు నమోదవుతున్నట్టు చెబుతున్నారు. సాధారణ జ్వరాల తర్వాత కొద్ది మోతాదులో టైఫాయిడ్ జ్వరాలు వస్తున్నాయంటున్నారు.

మారుమూల ప్రాంతాలల్లో అధ్వానం

ప్రధాన రహదారుల్లో ప్రతి రోజూ పారిశుధ్య పనులను చేస్తున్న సిబ్బంది. మారుమూల ప్రాంతాల్లో పారిశుధ్యం నిర్వహణను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆ ప్రాంత కార్పొరేటర్లు ఉన్న ప్రాంతాల్లో చూపుతున్న శ్రద్ధ ఇతర ప్రాంతాల్లో చూపకపోవడం పట్ల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నామమాత్రంగా చెత్త సేకరణ



గతంలో ఇంటింటికీ వచ్చి చెత్త సేకరించేవారు. ప్రస్తుతం ఇంటింటా చెత్త సేకరణ మొక్కుబడిగా మారింది. దీంతో ఎక్కడి చెత్త అక్కడ పోగు పడిపోతుంది. కొన్ని సందర్భాల్లో రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో స్థానికులు చెత్త వేస్తున్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమంపై ప్రస్తుత పాలకులు దృష్టి సారించాలి.

– కాటి దాసు, స్థానికుడు, ఏలూరు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ



నగరంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య నిర్మూలనకు పటిష్ట చర్యలు చేపట్టాం. ఎక్కడైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తాం. డ్రెయినేజీ వ్యవస్థను ప్రక్షాళన చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపడుతున్నాం.

– ఎ.భాను ప్రతాప్, కమిషనర్, ఏలూరు నగర పాలక సంస్థ

మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవలు



దొండపాడు పరివర్తన్ పాఠశాలలో మథర్ థెరిస్సా జయంతి

ఏలూరు (టూటౌన్): మదర్ థెరిస్సా 114వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మానవత ఏలూరు యూనిట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని థెరిస్సా విగ్రహానికి, రెడ్ క్రాస్‌లోని కృష్ణుడి విగ్రహాలకు పూలమాలలు వేశారు. మానవత అధ్యక్షురాలు పోడూరి కనకదుర్గ, జిల్లా కార్యదర్శి పోలవరపు దేవరత్నాకరరావు, డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ మేతర అజయ్ బాబు, ఆడిట్ కమిటీ డైరెక్టర్ కడియాల కృష్ణారావులు మాట్లాడుతూ థెరిస్సా స్ఫూర్తితో మానవత సంస్థ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు పంచారు. కార్యక్రమంలో మానవత సభ్యులు కోనేరు రవీంద్ర, అగ్గాల కోహిమ, యార్లగడ్డ విష్ణు, ఆసుపత్రి ట్రైనింగ్ నర్సులు, తదితరులు పాల్గొన్నారు.

పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో..

దొండపాడులోని పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలలో ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఏలూరు హేలాపురి లయన్స్ క్లబ్ వారిచే మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ రమణ, సభ్యులు థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. థెరిస్సా సేవలను రమణ కొనియాడారు. లయన్ దాసరి గణేష్ బాబు పాఠశాలకు బియ్యం, నూనె, కందిపప్పు వంటి సరుకులు అందజేశారు. జిల్లా చైర్మన్ డి.హేమ సుందర్ పాల్గొన్నారు.

విశ్వమాత మదర్ థెరిస్సా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గ్జేవియర్ నగర్‌లోని మదర్ థెరిస్సా విగ్రహం వద్ద సెంట్రల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఎన్నో అనాథ శరణాలయాలను నెలకొల్పి, ఎంతో మంది కుష్టు బాధితులను చేరదీసి సేవ చేసిన థెరిస్సా విశ్వమాత అని అన్నారు. టి.రవి కుమార్, తోట ఎడ్వర్డ్, సీహెచ్ జకరయ్య, ఎ.వెంకటేశ్వరరావు, బి.దుర్గమ్మ, సీహెచ్ లక్ష్మి, ఎం దుర్గారావు పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో చెయిన్ స్నాచింగ్

ఏలూరు టౌన్ : ఏలూరు వన్‌టౌన్‌లో సోమవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో మండావారి వీధిలో ఉంటున్న మద్దుల జ్వాల అనే మహిళ వేణుగోపాలస్వామి గుడికి వెళ్లి పూజా కార్యక్రమాల అనంతరం ఇంటికి వెళుతున్నారు. మోటారు సైకిల్‌పై వచ్చిన ఇద్దరు అపరిచిత వ్యక్తులు ఆమె మెడలోని సుమారు మూడు కాసుల బంగారు గొలుసును లాక్కెళ్లారు. వెనక్కి లాగటంతో జ్వాల కిందపడిపోగా తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. పోలీసులు స్నాచింగ్‌కు పాల్పడిన వారి కోసం గాలిస్తున్నారు.

అక్కను కొడుతుంటే అడ్డు వెళ్లాడని..

ఏలూరు టౌన్ : సుంకరవారితోటలో ఆదివారం రాత్రి జరిగిన స్వల్ప ఘర్షణలో ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేయటంతో గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సుంకరవారి తోటలో ఆదివారం రాత్రి సర్కస్ చేసే వర్గానికి చెందిన వారంతా సర్కస్ అమ్మవారి పూజలు చేసుకుంటున్నారు. చెంచులకాలనీకి చెందిన భవానీ చంటి అనే వ్యక్తి, అతని బంధువులు ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో భవానీ చంటి అనేవ్యక్తి అక్కను అతని భావ భవానీ ఏసు కొడుతున్నాడు. అడ్డు వెళ్లిన చంటిపై ఏసు కత్తితో దాడి చేశాడు. చంటికి పొట్టపైన గాయాలు కావటంతో ఏలూరు జీజీహెచ్‌కు తరలించారు. చంటి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బహుజన సేన కో ఆర్డినేటర్‌గా బాజీ

ఏలూరు (టూటౌన్): బహుజన సేన రాష్ట్ర కో ఆర్డినేటర్‌గా షేక్ సయ్యద్ బాజీ (గాజుల బాజీ)ని నియమిస్తూ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మత్తే బాబీ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. స్థానిక బహుజన సేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. నిత్యం పేద ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





ఏలూరు గో సంరక్షణ కేంద్రంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నగరంలోని గోసంరక్షణ సమితి ప్రాంగణంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం శ్రీ రాధాకృష్ణ భగవానునికి క్షీరాభిషేకం చేశారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. ఉదయం 10 గంటలకు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ రాధాకృష్ణ పరమాత్మ కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం కోలాట, భజన బృందం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన చేశారు. అనంతరం కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ పోటీల్లో పాల్గొన్నారు. గోసంరక్షణ సమితి ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

ఆక్స్‌ఫర్డ్‌లో..

శాంతి నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు శ్రీ కృష్ణుడు, సత్యభామ, గోపికల అలంకరణలో అలరించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎం శారద కార్యక్రమాలు పర్యవేక్షించారు.

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి

దొండపాడు శ్రీ నం దత్త నాథ క్షేత్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, కృత్తికా నక్షత్రం సందర్భంగా శ్రీ దత్త సుబ్రహ్మణ్య స్వామి సన్నిధిలో పాల కావడి సేవ, పంచామృత అభిషేకం నిర్వహించారు. స్వామి వారికి వెన్నతో ప్రత్యేక అలంకరణ చేసి ఆరాధన, శ్రీకృష్ణ మహానారాయణ హోమం నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ, కృత్తికా నక్షత్ర దీపోత్సవ సేవ, శ్రీ సుదర్శన యంత్రారాధన, విశేష నైవేద్య సమర్పణ నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు.

58 రకాల సారె సమర్పణ

ఆదివారపు పేటలో శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిరంలో శ్రీకృష్ణుని ఉపాలయంలో ఇసుకపల్లి తాతరావు ఆధ్వర్యంలో మహిళా భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. 116 మంది మహిళా భక్తులు 58 రకాల స్వీట్స్, ఫ్రూట్స్, పిండి వంటలతో, పులిహోర, చక్కర పొంగలి, దద్దోజనం, పానకం, చలిమిడి, వడపప్పు, కొబ్బరికాయలు, అరటి పండ్లు, బెల్లం బూంది తదితర పదార్థాలు సమర్పించారు. అనంతరం స్వామి వారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద పంపిణీ చేశారు.



శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



వెన్న అలంకరణలో వేణుగోపాల స్వామి



ఆదివారపు పేట శ్రీకృష్ణుని ఆలయంలో భక్తులు సమర్పించిన సారె

